క్లుప్తంగా

రైతు సదస్సును జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. శనివారం పెనుమాక గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లి గుహల వద్ద నిర్వహించనున్న కొండవీటి వాగు ముంపు ప్రాంత రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. రైతు సదస్సులో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు జిల్లా కార్యదర్శి కల్లం రాజశేఖర్‌రెడ్డి, రైతు సంఘం రాజధాని నాయకులు కె.ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌కె ఎర్రపేరు, సాంబిరెడ్డి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

800మందికి కళ్లజోళ్లు పంపిణీ



ఫిరంగిపురం: స్థానిక సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో శనివారం 800 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గతనెలలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 500 మందిని కంటి ఆపరేషన్లు కోసం ఎంపిక చేయగా వారికి ఆపరేషన్లు చేశారు. కంటి వైద్యపరీక్షలు చేయించుకున్న 800 మందికి కళ్లజోళ్లు అందజేశారు. శంకర కంటి వైద్యశాల వైద్యులు డీఎస్ కీర్తి, దీప్తిగుప్తాలు పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు, మందులు అందజేశారు. కళ్లజోళ్లు అందుకున్నవారు మాట్లాడుతూ ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేయడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రవీంద్ర, దిలీప్, సైదులు, వెంకటేషులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం బహూకరణ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమనిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం దాత సహకారంతో యూనిఫాం బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.ఎస్. ఝాన్సీవాణి మాట్లాడుతూ పూర్వ ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు అభ్యర్థన మేరకు ఈమని పాఠశాలలో విద్యనభ్యసించిన పాఠశాల పూర్వ విద్యార్థి, భారతి ఫౌండేషన్ అధ్యక్షుడు బండి బాబూరావు రూ.50 వేల విలువగల యూనిఫాంను అందజేశారని తెలిపారు. ఈమని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన 18 మంది బాలికలను ప్రోత్సహించడానికి యూనిఫాం, ఈమని పాఠశాలలో 30 మంది బాలురకు స్కౌట్ యూనిఫాం, 30 మంది బాలికలకు గైడ్స్ డ్రెస్‌ను అందజేశారని తెలిపారు. బండి బాబూరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీరరాఘవయ్య, దుర్గా నాగరాణి, ప్రకాష్‌రావు, బ్రహ్మేశ్వరరావు, లక్ష్మణకుమార్, డేవిడ్ సురేష్ కుమార్, జోషిరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం అంబటినగర్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అంబటినగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కనే ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, బ్లూ గళ్ల లుంగీ, తెల్ల షర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలపైనే దృష్టి

- రహదారుల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నాం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



మదర్‌థెరిస్సా కాలనీలో బీటీ రోడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజలకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపైన దృష్టి పెట్టి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని బ్రహ్మానందపురం, మదర్ థెరిస్సా కాలనీలలో నిర్మిస్తున్న బీటీ రోడ్ పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రహదారులు లేక పేద ప్రజలు బురదలోనే ప్రయాణం చేస్తున్నారని, వారు నివాసముండే నివాసాల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన ప్రత్యేక నిధులతో రోడ్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. తాడేపల్లి, కుంచపల్లి మధ్య బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న పేద ప్రజల నివాసాలకు 40 సంవత్సరాలుగా కనీసం నడవడానికి కూడా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికంగా ఉన్నవారు మా దృష్టికి తీసుకురావడంతో వెంటనే కార్పొరేషన్ అధికారులను పంపించి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. బైపాస్‌రోడ్ నుండి బ్రహ్మానందపురం వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతుంటే గతంలో రెండు కోట్ల వ్యయంతో 30 అడుగుల బీటీ రోడ్ నిర్మాణం చేశామని తెలిపారు. రెండో విడతగా బ్రహ్మానందపురంలో మసీదు దగ్గర నుంచి రూ.35 లక్షలు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఇప్పటివరకు నిర్మించని రహదారులను సీసీ, బీటీ రోడ్లుగా మారుస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రూ.130 కోట్ల నిధులు కేటాయించడంతో ఈ పనులన్నింటిని శరవేగంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి, గాలయ్య, చంటి, అడిపి యాకోబు, హేమలత, వైఎస్సార్ సీపీ కుంచనపల్లి కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ వైస్ సర్పంచ్ అమరా నాగయ్య, తిరుమలరెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం తాతయ్య, చిలకయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల ఏర్పాటు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ అధికారులతో కలసి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 65 సంవత్సరాల కిందట ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దాత బొమ్ము నరసింహారెడ్డి ఆర్థిక సాయంతో నిర్మించిన భవనాన్ని ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. భవనం శ్లాబు శిథిలావస్థకు చేరుకోవడంతో కార్పొరేషన్ నిధులతో మరమ్మతులు నిర్వహించి విద్యార్థుల భోజనశాలగా వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మనువడి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్ము శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఎమ్మెల్యే ఆర్కే

- సొంత నిధులతో సమస్య పరిష్కారం
- త్వరలోనే శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పనులను పరిశీలిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగు పంటపొలాల్లో భారీగా నిలిచిపోవడంతో వాటిని బయటకు పంపించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శనివారం తన సొంత ఖర్చులతో పనులు ప్రారంభించారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని ఏ వర్గానికి చెందిన ప్రజలకు కష్టం వచ్చినా నేనున్నానంటూ తన సొంత ఖర్చులతో సమస్యలను పరిష్కరిస్తున్నారని దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలో రైతులు పొలాల్లో వర్షపు నీరు బయటకు వెళ్ల ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వెంటనే ఆయన ఆ సమస్యను పరిష్కరించేందుకు తన సొంత ఖర్చులతో తాత్కాలికంగా పనులు చేపట్టారని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరించేందుకు మండలపరిషత్ నిధుల నుంచి రూ. 5 లక్షల కేటాయించి స్లాబ్, కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించి తన సొంత ఖర్చులతో సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైతులు ధన్యవాదాలు తెలిపారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్కే చేయూత

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నియోజకవర్గ పరిధిలోని పలువురికి చేయూత అందించారు. మెల్లెంపూడి గ్రామానికి చెందిన ఈదులమూడి ఆశీర్వాదానికి ఎమ్మెల్యే సహకారంతో వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మారెడ్డి రాజారామిరెడ్డి శనివారం బడ్డీకొట్టును అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణారెడ్డి (నాని), అనిల్‌రెడ్డి, యూసఫ్ జానీ, షేర్ ఖాన్, విజయ్ కుమార్, షేక్ జాను గని తదితరులు పాల్గొన్నారు. పెనుమాక గ్రామానికి చెందిన గుగులోత్ కోటా నాయక్, వీసం సాంబశివరావులకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో ప్లాట్‌ఫారం రిక్షాలను వైఎస్సార్ సీపీ కన్వీనర్ దామేష్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొక్కా నాని, అంజిరెడ్డి, అన్నూరు సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, బషీర్, పులి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు బండ్లు అందజేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని కాజకు చెందిన చిరువ్యాపారులు చిన్న సాంబయ్య కాకుమాను ఆంతోనిలకు శనివారం నగరంలోని ఆటోనగర్‌లోని తన కార్యాలయం వద్ద పార్టీ నాయకుల చేతుల మీదుగా తోపుడు, టిఫిన్ బండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, మహిళా నేతలు మల్లవరపు సుధారాణి, సంకె సునీత తదితరులు పాల్గొన్నారు. బేతపూడికి చెందిన బేతపూడి మేరీమాత, కోసూరి కృష్ణ అనే చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే స్థానిక పార్టీ నాయకుల ద్వారా టిఫిన్ బండ్లను అందజేశారు.

నేడు ముస్లింల ఆత్మీయ కలయిక

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల సెంటర్‌లోని నరసరావుపేట రోడ్డులో రవీంద్ర హోటల్ గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల ముస్లింల ఆత్మీయ కలయిక, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ముస్లింల ఐక్యవేదిక శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సభలో ముస్లింల సమస్యలు, భావితరాల భవిష్యత్తుపై చర్చించనున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబ సభ్యులు వ్యర్థాలను ఆరుబయట వేయరాదని, ఒంటింటి నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విభజించి గ్రామ పంచాయతీ తరుపున గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలన్నారు. ర్యాలీ ద్వారా ప్రజలందరికి అవగాహన కల్పించారు. ప్రజలందరూ సంకల్పంతో గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, సర్పంచ్ కె.సాంబ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

మంగళగిరి: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7వ తేదీ గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

నులి పురుగులు చేరకుండా జాగ్రత్తలు పాటించాలి



నులి పురుగు నివారణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూపీహెచ్‌సీల వైద్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో అత్తోట దీప్తి, పక్కన ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి

మంగళగిరి: విద్యార్థులు నులి పురుగులు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని గణపతినగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పట్టణ, రూరల్ యూపీహెచ్‌సీ సెంటర్ల ఆధ్వర్యంలో శనివారం జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల హెచ్‌ఎంలకు, అంగన్‌వాడీ టీచర్లకు విద్యార్థులకు పంపిణీ చేసే మాత్రలను అందజేసి అవగాహన కల్పించారు. అనూష మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను పంపిణీ చేయాలన్నారు. మాత్రలు వేసుకున్నాక కడుపునొప్పి, వాంతులు అయినప్పటికీ భయపడాల్సిన అవసరం లేదని, ఏఎన్ఎంలు ప్రథమ చికిత్స అందిస్తారన్నారు. ఆగస్టు 10వ తేదీన ఎవరైనా విద్యార్థులు మాత్రలు తీసుకోకుంటే తిరిగి ఈనెల 17వ తేదీన పంపిణీ చేస్తామన్నారు. నులిపురుగుల మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థుల్లో రక్తహీనత తగ్గి బ్రెయిన్ అభివృద్ధి చెందుతుందన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వాష్ రూమ్‌కు వెళ్లేటప్పుడు చెప్పులతో వెళ్లడంతోపాటు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఎంపీడీఓ రామ ప్రసన్న, పట్టణ, మండల హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు సతీష్, రమేష్, సత్యవతి, లక్ష్మీనారాయణ, మోనాలి, వినీత, హేమంత్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం పలు గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. వైద్యులు సీహెచ్.యానీగ్రేస్, టి.ఎస్తేరురాణిలు మాట్లాడుతూ ఈనెల 10న నేషనల్ డీ-వార్మింగ్ డేను పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 17గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందజేసినట్లు తెలిపారు. 10వ తేదీ ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరువాత మాత్రలు మింగిస్తారన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్యసిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడికొండ: 2–19 సంవత్సరాల చిన్నారుల్లో నులి పురుగుల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. ఈ నెల 10న నులి పురుగుల నివారణ దినోత్సవం జరగనున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నులి పురుగులు కారణంగా చిన్నారుల్లో రక్తహీనత, ఇతర బలహీనతలు ఏర్పడి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు నులిపురుగుల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కావున నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో తెనాలి ఇందిర, పీహెచ్‌సీ వైద్యాధికారి బీఎస్‌కే భార్గవ, సిద్దార్థరెడ్డి, పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నుదురుపాడులో పత్తి పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ జి.కిషోర్

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో పత్తిపంటను ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ జి.కిషోర్, సీనియర్ కీటక విభాగం శాస్త్రవేత్త నగేష్‌లు శనివారం పరిశీలించారు. కిషోర్ మాట్లాడుతూ పత్తి పంటలో పేనుబంక, పచ్చదోమను గమనించినట్లు తెలిపారు. వాటి నివారణకు 300గ్రాముల ఎసిఫేట్, లేదా 50 కాన్ఫిడర్ ఎంఎల్‌గానీ పిచికారీ చేయాలని రైతులకు సూచించామన్నారు. కాండం పూత మందును ప్రతి 20లేదా, 40లేదా, 60 రోజులకు కాండానికి పూతపూయాలని చెప్పారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరులకేంద్రం వ్యవసాయ ఉపసంచాలకులు రామాంజనేయులు, ఏవో రమణకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆప్కో చైర్మన్ చిరంజీవి జన్మదిన వేడుకలు



చినకాకాని షైన్ ఆనంద శరణాలయం విద్యార్థులకు అన్నదానం చేస్తున్న అభిమానులు

మంగళగిరి: ఆప్కో చైర్మన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి జన్మదిన వేడుకలు శనివారం నగరంలోని పలుచోట్ల ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పాత మంగళగిరి పద్మజ్యోతి వయోవృద్ధుల ఆశ్రమంలో చిరంజీవి అభిమానులు వృద్ధుల చేత కేక్ కట్ చేయించి దుప్పట్లు పంపిణీ చేశారు. జగనన్న కాలనీలో జరిగిన వేడుకల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థి ఆర్ కావ్యకు చిరంజీవి అభిమానులు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్పొరేషన్ పరిధి చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో పిల్లల చేత కేక్ కట్ చేయించి చాక్లెట్లు, స్వీట్లు పంచిపెట్టి అన్నదానం నిర్వహించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నియోజకవర్గ పరిధిలోని పెద కొండూరుకు చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని కుటుంబానికి గంజి చిరంజీవి అభిమానుల చేతుల మీదుగా బాధితుని కుటుంబ సభ్యులకు అందజేయించగా పెద కొండూరు గ్రామంలోని యువతకు చిరంజీవి అభిమానుల చేతుల మీదుగా క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1441 పనులు



మాట్లాడుతున్న పీడీ యుగంధర్‌కుమార్, వేదికపై ఎంపీపీ షహేలా నర్గీస్

ఫిరంగిపురం: గడిచిన ఆర్థిక సంవత్సరంలో మండలంలోని అన్ని గ్రామాల్లో 1441 పనులు చేశామని డ్వామా పీడీ యుగంధర్‌కుమార్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ 2022–2023 వ ఆర్థిక సంవత్సరం 16విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ బృంద సభ్యుడు ఎస్ఆర్ రాజు నేతృత్వంలో 12 బృందాలు 17 గ్రామ పంచాయతీలలో ఆడిట్ చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పంట కాలువల్లో పూడికతీత, ఫీడర్ కాలువలు, మేజర్, మైనర్ కాలువలు, పండ్లతోటలు, హౌసింగ్ 90రోజుల పనిదినాలు వంటి పనులు గురించి ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, ఎంపీడీవో డి. అనూరాధ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, జిల్లా విజిలెన్స్ అధికారి టి.విజయలక్ష్మి, జిల్లా అంబుడ్స్‌మన్ అధికారి ఎం.కౌముది, ఎస్ఆర్‌పీలు రామారావు, ఎం.శ్రీనివాస్, శివన్నారాయణ, జె.ప్రభాకర్, బి.విజయలక్ష్మి, ఎం.సుమలత, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను నిరసిస్తూ ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

మంగళగిరి: మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధాని మోదీ పూనుకోవాలన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి మున్నా, కె రవితేజ, కె మహేష్ నాయక్, అఖిల్, అబ్రహం, రమేష్‌బాబు, మహేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఎస్‌వీవీ విద్యార్థి ఎంపిక



వివరాలు వెల్లడిస్తున్న హెచ్‌ఎం పి దేవరాజు, పీడీ సుంకర శ్రీనివాస్

తాడికొండ: షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలో తమ పాఠశాల విద్యార్థి మార్కపూడి రాం ప్రకాష్ స్టేట్ మీట్‌కు ఎంపికై నట్లు తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెరికల దేవరాజు, పీడీ సుంకర శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈ నెల 04వ తేదీన గుంటూరులోని విజేత ఐటీ స్కూల్‌లో నిర్వహించిన అండర్ 17 షూటింగ్ బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థి మార్కపూడి రాం ప్రకాష్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జట్టులో సభ్యుడిగా ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 11–13 వరకు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి మీట్‌లో పాల్గొనేందుకు జట్టులో ప్రాతినిధ్యం వహిస్తుండటం తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాల పేరును ఇనుమడింపజేయాలని విద్యార్థిని అభినందించారు. విద్యార్థికి ఆటలో అత్యుత్తమ తర్ఫీదు అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుంకర శ్రీనివాస్, క్రీడాకారుడు రాం ప్రకాష్‌ను హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతో అనారోగ్యం దూరం



బాలింతలకు కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య

మేడికొండూరు: మండలంలోని డోగిపర్రు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సంపూర్ణ పోషకాహారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దరి చేరవన్నారు. చిన్నారులకు అందిస్తున్న ఆహారం పరీక్షించి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సందెపోగు సాంబ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉడతా ప్రభాకర్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు తోట పార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.